

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కిగౌడ్‌ను సన్మానిస్తున్న బాలాజీనగర్ కాలనీ వాసులు

కీసర తరహాలో వీరన్నగుట్ట అభివృద్ధికి కృషి

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కిగౌడ్

హయత్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వీరన్నగుట్టను కీసరగుట్ట తరహాలో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కిగౌడ్ అన్నారు. బుధవారం రాత్రి వీరన్నగుట్టలోని భద్రకాళీ రామలింగేశ్వరస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడి ఆలయ అభివృద్ధిపై చర్చిస్తానన్నారు. చిన్నప్పుడు వీరన్నగుట్ట పరిసరాల్లో ఆడుకునేవారమని గుర్తుచేశారు. అనంతరం కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు కిషోర్‌గౌడ్, బీమిడి రామకృష్ణారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హైడ్రా సిబ్బంది

చెరువుల వద్ద 'హైడ్రా' పెట్రోలింగ్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఆక్రమణల అడ్డుకట్టకు హైడ్రా మరో అడుగు ముందుకేసింది. ఆక్రమణలదారులు రాత్రి సమయంలోనే చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిని మట్టితో పూడ్చుతున్న విషయం తెలిసిందే. ఆక్రమణలను అడ్డుకునేందుకు హైడ్రా సిబ్బంది రాత్రి సమయంలో చెరువుల వద్ద పెట్రోలింగ్ చేస్తోంది. బుధవారం రాత్రి తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల వద్ద హైడ్రా సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా సెలవు రోజుల్లో ఆక్రమణదారులు పూడ్చివేతలకు పూనుకుంటున్న నేపథ్యంలో హైడ్రా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిసింది.



మహిళా భవన్ అభివృద్ధికి మంజూరైన నిధుల పత్రాన్ని మహిళలకు అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

మహిళా సంక్షేమ సంఘం భవనానికి రూ. 12.80 లక్షలు

వనస్థలిపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సాహెబ్‌నగర్‌లో మహిళా సంక్షేమ సంఘం భవనం అభివృద్ధి పనులకు మంజూరైన రూ. 12.80 లక్షలు పత్రాన్ని మహిళలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు పద్మ, అర్చన, అరుణ, గౌతమి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

2న మీర్‌పేట్ సాయి పీఠంలో చండీ హోమం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 11వ డివిజన్‌లోని ప్రశాంతిహిల్స్ కాలనీలో గల ద్వారకామయి సాయిబాబా పీఠంలో మార్చి 2న లోక కల్యాణార్థం గణపతి, చండీ హోమం నిర్వహిస్తున్నామని పీఠాధిపతి గోపాల కృష్ణానంద స్వామీజీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, సమాజంలో అశాంతి తొలగిపోయి శాంతి పెంపొందించే లక్ష్యంతో ఈ హోమాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సంకల్పం, గణపతి పూజ, కలశస్థాపన, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అనంతరం హోమాలు నిర్వహిస్తామని వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. హోమంలో పాల్గొనదలచిన వారు గోత్ర నామాలు తెలియజేయాలన్నారు. వివరాలకు 9490746120 ఫోన్ నంబర్‌లో, లేదా పీఠంలో సంప్రదించవచ్చన్నారు.



చంచల్‌గూడ జైలు క్వార్టర్స్ ఆలయంలో శివ కల్యాణంలో జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ దంపతులు



దిల్‌సుఖ్‌నగర్ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో కల్యాణంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కమల దంపతులు



మన్సూరాబాద్ ఉమానాగలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ప్రసన్న దంపతులు



కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం



సలీంనగర్ షిర్డీసాయి సంస్థాన్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలకు హాజరైన సీపీ సీవీ ఆనంద్, సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ తదితరులు

మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్, కొత్తపేట, కర్మన్‌ఘాట్, మన్సూరాబాద్, నాగోల్, బండ్లగూడ, మీర్‌పేట, బడంగ్‌పేట్, ఓల్డ్ మలక్‌పేట్‌లలో బుధవారం రాత్రి పలు ఆలయాల్లో లింగోద్భవ సమయంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయాల ధర్మకర్తలతోపాటు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

\- ఎల్బీనగర్ జోన్ బృందం (ఆంధ్రజ్యోతి)



దిల్‌సుఖ్‌నగర్ మారుతీ మందిర్‌లో శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో ధర్మకర్తలు కిరణ్, నరేందర్, గౌని చంద్రయ్య తదితరులు



పుష్పాలంకరణలో శివపార్వతులు



లింగోద్భవ వేళ స్వామివారికి అన్నాలంకరణ



అన్మగల్‌లో రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ నిర్వహిస్తున్న వేదపండితులు



మీర్‌పేట్ శివసాయినగర్‌లో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చికెన్ మేళా

● బర్డ్ ఫ్లూపై ప్రజలకు అవగాహన

చంపాపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):చంపాపేట గాంధీ చౌరస్తాలో గురువారం చికెన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్మన్‌ఘాట్ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి పాల్గొని ప్రజలకు చికెన్, గుడ్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ చికెన్ తినడంపై వస్తున్న అపోహలను నమ్మొద్దని కోరారు. అనంతరం ప్రజలతో కలిసి చికెన్ తిన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌అధ్యక్షుడు కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాదర్, కార్యదర్శి బాల్‌రాజ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చంపాపేటలో నిర్వహించిన చికెన్ మేళాలో పాల్గొన్న టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి తదితరులు

బీఎస్ఎన్ఎల్ టవర్లను

ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేయాలి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం జరిగిన టెలికాం అడ్వయిజరీ కమిటీ సమావేశంలో సభ్యుడు, బీజేపీ బడంగ్‌పేట్ కార్పొరేషన్-1 అధ్యక్షుడు ఆర్.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ టవర్లను ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేయాలని సూచించాడు. టవర్లను ప్రైవేటు భవనాలపై ఏర్పాటు చేయడం వల్ల బీఎస్ఎన్ఎల్ యజమానులకు పెద్ద మొత్తంలో అద్దె చెల్లించాల్సి వస్తుందన్నారు. ఆయన సూచనకు ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ భవనాల వివరాలు సేకరించి టవర్లు ఏర్పాటు చేయడానికిగల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

భక్తిభావాన్ని చాటిన 'శివోహం'

రవీంద్రభారతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రిని పురస్కరించుకుని స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన శివోహం కార్యక్రమం ప్రేక్షకులకు భక్తిభావాన్ని పంచింది. గురువారం జరిగిన వేడుకల్లో కళాకారులు నిర్విరామంగా 8గంటలు కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రీయ నృత్యం, సంగీతం, ఫ్లూట్, వయోలిన్ వాయిద్య కచేరీ, కర్ణాటక సంగీత కచేరీ తదితర కళారూపాలను ప్రదర్శించారు. చక్కటి నాట్యం, గానంతో కళాకారులు ప్రేక్షకులను అలరించారు. కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించిన నర్తకులు ఆహూతులను రంజింపజేశారు. పలు భక్తిగీతాలు, సంకీర్తనలు ఆలపించిన గాయకులు శ్రోతలను మైమరిపించారు. కార్యక్రమంలో అతిథులుగా రాధాకుమారి, ప్రొఫెసర్ డా.ఆంజనేయులు, గాడిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిభావం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.



నాటకంలోని సన్నివేశం

ఆకట్టుకున్న చరణదాసు జానపద నాటకం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దోచుకున్న సొమ్మును జనాలకు పంచే దొంగగా పేరొందిన చరణదాసు జీవనాన్ని వివరిస్తూ సాగిన చరణదాసు నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గురువారం రవీంద్రభారతిలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో చరణదాసు జానపద నాటకం ప్రదర్శించారు. భూమిక థియేటర్ గ్రూప్ సమర్పించిన ఈ నాటకానికి హబీబ్ తన్వీర్ మూల కథను అందించారు. తెలుగు అనుసరణ, పాటలు, డిజైన్ దర్శకత్వం ఉదయభాను గరికపాటి అందించారు.

మంచి చెడులు కలిసిన నడత రెండు కాళ్ల నడక లాంటిదనే ఇతివృత్తంగా సాగిన నాటకం ఆహూతులను రంజింపజేసింది. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు. నవ్వులు పూయిస్తూ సాగిన నాటకం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. కార్యక్రమంలో పలువురు నాటక ప్రయోక్తలు పాల్గొని నటీనటులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరణదాసు వంటి నాటకాన్ని ప్రదర్శించడం సంతోషకరమని అన్నారు. రసరంజని సంస్థ ప్రతీనెలా నాటకం, ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం నినాదంతో ముందుకు సాగడం అభినందనీయమని పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న కులగణన

● మలక్‌పేట సర్కిల్-6లో 350 దరఖాస్తులు

ఓల్డ్‌మలక్‌పేట ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కులగణన శుక్రవారంతో ముగియనుంది. మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో ఏడు డివిజన్‌లలో వార్డు కార్యాలయాల్లో కులగణన కొనసాగుతోంది దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో 350 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు, సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు వివరాలు ఇవ్వని వారు కులగణనలో పాల్గొనాలని మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్ కోరారు.



ధ్వంసమైన మ్యాన్‌హోల్ వద్ద ఎరుపు రంగు గుడ్డ కట్టి పాతిన కర్ర

మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో

డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసం

ఓల్డ్‌మలక్‌పేట ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసమైంది. నెలలు గడుస్తున్నా మరమ్మతు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మెకానిక్ ఆత్మహత్య

హయత్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. హయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన దుకణ్‌కుమార్ (26)బతుకుదెరువు కోసం ఆరు నెలలక్రితం నగరానికి వచ్చి పెద్ద అంబర్‌పేటలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. స్థానికంగాగల జై హనుమాన్ ఎర్త్ మూవర్స్‌లో ఎక్సకేవేటర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం గదిలో తాడుతో ఉరేసుకున్నాడు. స్నేహితులు డయల్ 100కు ఫోన్ చేయగా.. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మతుడి సోదరుడు మేఘనాథ్ కుమార్ గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడితో అసభ్యంగా ప్రవర్తించిన

వ్యక్తికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బాలుడితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి పోక్సో ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించింది. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడు సోదరుడితో కలిసి ఆడుకుంటుండగా మహ్మద్ ఇద్రిస్ అనే వ్యక్తి అతడితో అసభ్యంగా ప్రవర్తించాడు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎమ్‌కే పద్మావతి నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగారా శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించడంతో పాటు బాధితుడికి రూ. 3 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

1.40 కిలోల గంజాయి స్వాధీనం

● నిందితుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడికి సహకరిస్తున్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. తాళ్లకట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ ముగ్దమ్ గంజాయి కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లలో పెట్టి అధిక ధరకు విక్రయిస్తున్నాడు. తలాబ్‌కట్ట ప్రాంతంలోని జీషాన్ స్కూల్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 1.40 కిలోల గంజాయి, రూ. 70,400, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇతడికి సహకరిస్తున్న మహ్మద్ వాజిద్, ఎండీ జావెద్‌లు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయి, నగదు

వ్యక్తి అదృశ్యం

హయత్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. హయత్‌నగర్ సాయినగర్ కాలనీలో నివసిస్తున్న పెరుమాళ్ల కమలాకర్(44) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పని ఉందని గత ఆదివారం ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య మణెమ్మ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అతడి ఆచూకీ లభించకపోవడంతో గురువారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కమలాకర్

నిర్మాణం పూర్తయి ఏడాది అయినా..

ప్రారంభానికి నోచుకోని పార్కు

● పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ● రోడ్లపైనే వాకింగ్ చేస్తున్న ప్రజలు

హయత్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):పార్కు నిర్మాణం పూర్తయి ఏడాదైనా నేటికీ ప్రారంభించకపోవడంపై హెచ్ఎండీఏ అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని కమర్షియల్ ట్యాక్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కాలనీలో పార్కు కోసం సుమారు 4,400 గజాల స్థలాన్ని విడిచిపెట్టారు. హెచ్ఎండీఏ సదరు స్థలంలో రూ. 1.85 కోట్లతో రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించింది. గత ఏడాది పార్కు నిర్మాణం పూర్తవడంతో అధికారులు గేటుకు తాళం వేసి వాచ్‌మన్‌ను ఏర్పాటు చేశారు.

పార్కును అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ జీవన్ రెడ్డి, హెచ్ఎండీఏ అధికారులకు ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. నేటికీ పార్కును ప్రారంభించకపోవడంతో బుధవారం పరిసర కాలనీల ప్రజలు అధికారులు, పాలకుల తీరుపై నిరసన తెలిపారు.





కమర్షియల్ ట్యాక్స్ కాలనీలోని జైహింద్ పార్కు

రోడ్లపై వాకింగ్ చేస్తున్నాం



పార్కును ప్రారంభించకపోవడంతో రోడ్లపై వాకింగ్ చేస్తున్నాం. ఇంటి ఎదుటే పార్కు ఉన్నా ఉపయోగించుకోలేని పరిస్థితి. పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

\-పిల్లలమర్రి గిరిధర్, కమర్షియల్ ట్యాక్స్ కాలనీ సభ్యుడు

ఏడాదిగా తాళం వేసి ఉంది



పది కాలనీల ప్రజలను దృష్టిలో పెట్టుకొని నిర్మించిన పార్కును అందుబాటులోకి తీసుకురాకపోవడం దారుణం. పార్కు గేటుకు హెచ్ఎండీఏ అధికారులు ఏడాదిగా తాళం వేసి ఉంచారు. వాకింగ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నాం.

\-సింగం వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు, కమర్షియల్ ట్యాక్స్ కాలనీ సంక్షేమ సంఘం

ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు



పార్కును ప్రారంభించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, హెచ్ఎండీఏ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. పార్కును ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

\- సామ తిరుమల్‌రెడ్డి, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు

పార్కును ప్రారంభించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని జీహెచ్ఎంసీకి గతనెలలో లేఖ రాశాం. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

\- జీవన్‌రెడ్డి, హెచ్ఎండీఏ ఏఈ